సాక్షి
ప్రకాశం
బుధవారం । 5 । జూలై । 2023



మెనూ అమలులో కక్కుర్తి వద్దు

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో మెనూ ప్రకారం భోజనం ఉండాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. - 8లో..



లోప రహితంగా ఓటరు జాబితా

లోప రహితంగా ఓటర్ల జాబితాను రూపొందించాలని కలెక్టర్ దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
29 /26

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఐదుగురు ఎస్‌ఐలకు స్థానచలనం

ఒంగోలు టౌన్: జిల్లాలో ఐదుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ మలికా గర్గ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు వన్‌టౌన్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న యువీ కృష్ణయ్యను ముండ్లమూరు పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. ముండ్లమూరులో పనిచేస్తున్న ఎల్.సంపత్ కుమార్‌ను జిల్లా వీఆర్‌కు పంపించారు. అర్ధవీడు ఎస్‌ఐ ఎం.వెంకటేశ్వర్లు నాయక్‌ను మార్కాపురం రూరల్‌కు, మార్కాపురం రూరల్ ఎస్‌ఐ ఆర్.సుమన్ ను త్రిపురాంతకం పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. త్రిపురాంతకం ఎస్‌ఐ జి.వెంకట సైదులును జిల్లా వీఆర్‌కు పంపించారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ టీటీడీసీలో నిర్వహించే మెగా జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మంగళవారం ప్రకాశం భవనంలో ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో 15 కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిల సహకారంతో నిర్వహించే జాబ్‌మేళా ఉదయం 9 గంటల నుంచి ప్రారంభమవుతుందని నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం తెలిపారు. జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దీనిలో డీఆర్‌డీఏ పీడీ బాబురావు, మెప్మా పీడీ రవికుమార్, సీపీవో వెంకటేశ్వర్లు, డీపీవో నారాయణరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు అర్బన్: భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 2022 సంవత్సరానికి టెన్జింగ్ నార్గే నేషనల్ అడ్వెంచర్ అవార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. భూమి, సముద్రం, గాలిపై సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. సాహస క్రీడల్లో అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రదర్శించిన వ్యక్తులకు జీవిత కాల సాఫల్యం కింద ఈ అవార్డును ప్రతి సంవత్సరం ఆగస్టు 29వ తేదీ రాష్ట్రపతి చేతుల మీదుగా ఇస్తారని పేర్కొన్నారు. దీంతోపాటు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహం, ప్రశంసపత్రం, రూ.15 లక్షల నగదు బహుమతి ఇస్తారన్నారు. దరఖాస్తు ఇతర వివరాలకు http://awardr.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చన్నారు. నిర్ణీత దరఖాస్తును తగిన వివరాలతో ఈ నెల 7వ తేదీలోపు జిల్లా యువజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

వక్ఫ్‌బోర్డు గజిట్‌లో సర్వే నంబర్ 113 భూమి

ఒంగోలు అర్బన్: సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట గ్రామంలోని రాజావారి పీర్ల చావిడి (ఆషూర్ ఖానా)కి సంబంధించిన సర్వే నంబర్ 113లో మొత్తం విస్తీర్ణం 18.88 ఎకరాలు రాష్ట్ర వక్ఫ్‌బోర్డు గజిట్ నం 26 ప్రకారం వక్ఫ్‌బోర్డ్ గజిట్‌లో ప్రచురితమైనట్లు మైనార్టీ సంక్షేమ అధికారి అర్చన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్థలానికి సంబంధించి హైకోర్టులో కూడా కేసు పెండింగ్‌లో ఉందని తెలిపారు. ఈ భూమిని ఎవరైనా క్రయ విక్రయాలు జరిపితే చట్ట రీత్యా చర్యలు ఉంటాయన్నారు. ఎవరూ ప్రలోభాలకు లోబడి ప్రజలు మోసపోవద్దని తెలిపారు. ఆక్రమించినా చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జాతీయ స్థాయి జూనియర్ బాక్సింగ్ కోచ్‌గా వేణు



పాణ్యం వేణు

మార్కాపురం టౌన్: ఈనెల 8 నుంచి 15వ తేదీ వరకు అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగే 5వ జాతీయ జూనియర్ బాలుర బాక్సింగ్ టోర్నమెంట్‌కు కోచ్‌గా మార్కాపురం పట్టణానికి చెందిన జిల్లా బాక్సింగ్ కోచ్ పాణ్యం వేణును నియమిస్తూ రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, ఎండీ ఉత్తర్వులు జారీ చేశారురు. ఆరేళ్ల నుంచి వేణు జిల్లా స్పోర్ట్స్ అథారిటీలో బాక్సింగ్ కోచ్‌గా ఉన్నారు. వేణును కోచ్‌గా ఎంపిక చేయడం పట్ల జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొట్టు సుబ్బారావు, ఉదయరాజు, స్టెప్ సీఈవో బాబురావు, చీఫ్ కోచ్ రాజ రాజేశ్వరి, మార్కాపురానికి చెందిన శ్రీ కోడిరామ్మూర్తి క్రీడా సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పిన్నిక నాగేశ్వరరావు, కాళంగి శ్రీనివాసులు అభినందించారు.

సర్కార్ బిడ్డకు.. బంగారు బాట..!

విద్యారంగాభివృద్ధికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సర్కార్ స్కూళ్ల రూపురేఖలను మార్చేసింది. నాణ్యమైన విద్య, చక్కటి మౌలిక వసతులు కల్పించింది. అదే స్ఫూర్తితో పేద విద్యార్థుల బంగారు భవితకు పటిష్ట పునాదులు వేస్తున్నారు జిల్లా అధికారులు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కార్పొరేట్ సంస్థలను తలదన్నే రీతిలో ఇంటర్‌తోపాటు జాతీయస్థాయి పోటీ పరీక్షలైన జేఈఈ, నీట్‌లో రాణించేలా శిక్షణ ఇప్పించేందుకు కలెక్టర్ దినేష్‌కుమార్ నేతృత్వంలో రంగం సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని నీట్, జేఈఈ శిక్షణ తీసుకోలేని పేద విద్యార్థులకు ఇదో సువర్ణ అవకాశంగా మారనుంది.



- ప్లస్ వన్ నుంచి నీట్,జేఈఈల్లో శిక్షణ
- ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన పేద విద్యార్థులకు సువర్ణ అవకాశం
- ఇంటర్ మొదటి సంవత్సరం నుంచే శిక్షణ ప్రారంభం
- 100 మంది నీట్‌కు, మరో 100 మంది జేఈఈకి
- అందులో సగం మంది విద్యార్థినిలకు అవకాశం
- ప్రత్యేక క్యాంపస్‌లు, ఉచిత హాస్టల్ వసతి
- అనుభవం ఉన్న శిక్షకులను నియమించేందుకు చర్యలు

ఒంగోలు అర్బన్: విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యతను ఇస్తూ పేద విద్యార్థులు మెరుగైన విద్యను అందించేందుకు ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అదే స్ఫూర్తితో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేద విద్యార్థుల ఉన్నత భవితపై ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులను ప్రోత్సహించేలా 'కాఫీ విత్ కలెక్టర్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. దీని ద్వారా వారి అభిరుచులు తెలుసుకుని అవసరమైన సూచనలు, సలహాలతో పాటు సహకారం అందిస్తున్నారు. అంతేకాకుండా మార్గదర్శిని పేరుతో పది, ఇంటర్మీడియెట్ చదువుకునే విద్యార్థులకు పాస్ అయిన తర్వాత భవిష్యత్తు లక్ష్యాలను ఎంచుకునేలా కెరియర్ గైడెన్స్ ఇస్తూ అండగా నిలుస్తున్నారు. తాజాగా మరో ముందడుగు వేశారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి ఉత్తమ మార్కులు సాధించిన వారికి ప్లస్ వన్, ప్లస్‌టూల్లో తొలి నుంచి ప్రైవేటు కాలేజీలకు దీటుగా ఉండేలా 'నీట్' 'జేఈఈ'ల్లో శిక్షణ ఇచ్చి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

200 మంది ఎంపిక:

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించి నీట్, జేఈఈలకు సంబంధించి 200 మంది విద్యార్థులను ఎంపిక చేస్తారు. వారిలో 100 మంది నీట్ (50 మంది బాలురు, 50 బాలికలు) అదేవిధంగా మరో 100 మంది విద్యార్థులను జేఈఈలకు ఎంపిక చేస్తారు. ఎంపికైన 200 మందికి పూర్తి హాస్టల్ వసతితో శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. అందుకు సంబంధించి ప్రత్యేకంగా రెండు క్యాంపస్ (నీట్, జేఈఈ)లు హాస్టల్ వసతితో పాటు ఏర్పాటు చేస్తున్నారు. హాస్టల్స్‌లో నాణ్యమైన భోజనంతో పాటు బెడ్‌లు, ఇతర మౌలిక సదుపాయాలు హైజీన్‌గా ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టారు. విద్యార్థులు చదువుకునేందుకు అవసరమైన పూర్తి స్థాయి వాతావరణం హాస్టల్స్‌లో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొత్తపట్నంలో ఒక క్యాంపస్, సింగరాయకొండ పరిసరాల్లో మరో క్యాంపస్ ఉండేలా ప్రభుత్వ భవనాలను పరిశీలించాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. ఇంటర్మీడియెట్‌తో పాటు నీట్, జేఈఈల్లో మొదటి సంవత్సరం నుండే శిక్షణ ఇచ్చేలా పక్కా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ శిక్షణతో పాటు కెరియర్ గైడెన్స్, మోటివేషన్ తరగతులు నిర్వహిస్తారు. విద్యార్థులను పూర్తి స్థాయిలో పోటీ పరీక్షలకు సిద్ధం చేసి మంచి ఫలితాలు సాధించే దిశగా పక్కా వ్యూహాన్ని రచించారు. ప్రభుత్వ అధ్యాపకులతో పాటు అవసరమైతే బయట నుంచి అనుభవం ఉన్న శిక్షకులను రంగంలోకి దింపేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ జూలై చివరికి లేదా ఆగస్టు నుంచి ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమం విజయవంతం అయితే పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

పేద విద్యార్థులకు అండగా

ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఆణిముత్యాలులో చురుకైన విద్యార్థులు నీట్, జేఈఈ, ఐఐటీలకు సంబంధించి ఫీజులు కట్టి శిక్షణ తీసుకోలేని విద్యార్థులకు సైతం కలెక్టర్ స్పాన్సర్స్ ద్వారా ఫీజులు కట్టేలా కృషి చేయడంతో పాటు కలెక్టర్ స్వయంగా దుస్తులు, పుస్తకాలు, అవసరమైన వస్తువులు కొనిపెడుతూ ధైర్యానిస్తున్నారు.

పేదరికం చదువులకు అడ్డు కాకూడదు



చక్కటి తెలివితేటలు ఉండి చదువుల్లో బాగా రాణిస్తూ పదో తరగతి తర్వాత ఉన్నత చదువులు చదివేందుకు పేదరికం అడ్డు కాకూడదు. పదో తరగతిలో మంచి మార్కులు సాధించి కూడా డబ్బు లేని కారణంగా నీట్, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన శిక్షణ తీసుకోలేకపోతున్నారు. ప్రభుత్వ స్ఫూర్తితోనే ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివిన విద్యార్థులకు ఇంటర్‌తో పాటు నీట్, జేఈఈల్లో ఇంటర్ మొదటి సంవత్సరం నుండే శిక్షణ ఇవ్వనున్నాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

పీహెచ్‌సీల్లో సుఖ ప్రసవాలు జరగాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు)ల్లో సుఖ ప్రసవాలు కచ్చితంగా చేయాలని కలెక్టర్ ఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ప్రకాశం భవనం నుంచి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను మాత్రం ఏరియా, జిల్లా ఆస్పత్రులకు పంపాలన్నారు. పీహెచ్‌సీల్లో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలన్నారు. అవసరమైన అన్నీ మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. దీంతోపాటు అవసరమైన అన్నీ రకాల మందులు అందుబాటులో ఉండేలా వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమంలో నిర్లక్ష్యం వహిస్తే మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్, ఏఎన్ఎంలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలను వైద్య అధికారులు పరిశీలించి పంచాయతీరాజ్ ఎస్ఈలతో సమన్వయం చేసుకుని త్వరగా పూర్తి చేయాలన్నారు. సచివాలయాల్లో సిబ్బంది బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా రెండు పూటల వేయాలని, సేవలకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలని ఆదేశించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆధార్ సేవలను పూర్తి స్థాయిలో అందించాలన్నారు. ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ వేగంగా పూర్తి చేయాలన్నారు. జగనన్న గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. పిల్లల ఆరోగ్యంపై పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిలో సీపీవో వెంకటేశ్వర్లు, డీపీవో నారాయణరెడ్డి, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి ఉషారాణి, టీబీ నివారణ అధికారి సురేష్ పాల్గొన్నారు.

నేనే వీఆర్వో.. నేనే ఎమ్మార్వో..



వెంకట రెడ్డికి, అతని బంధువులకు ఇచ్చిన డీకే పట్టాలు ఇవే



వెంకటరెడ్డికి ఇచ్చిన దొంగ పాస్ పుస్తకం




పట్టాలపై గత తహసీల్దార్, ప్రస్తుత ఆర్డీవో పేరితో ఉన్న మ్యాన్యువల్ సంతకాలు

- దొంగ స్టాంప్‌లు, ఫోర్జరీ సంతకాలతో ఇళ్ల పట్టాలు, డీకే పట్టాలు, పాస్ పుస్తకాలు తయారు చేసిన ఘనుడు
- సుమారు రూ.అరకోటికి పైగా స్వాహా..
- లబోదిబోమంటున్న బాధితులు
- ఇప్పటికి సుమారు డజను మంది బాధితులు
- పోలీసుల అదుపులో నిందితుడు
- పట్టాలపై సంతకాలన్నీ గత తహసీల్దార్, ప్రస్తుత కనిగిరి ఆర్డీవో పేరుతోనే..

కనిగిరి రూరల్: ''నేనే వీఆర్వో.. నేనే ఎమ్మార్వో'' అన్నట్లు జగన్నాథం సురేష్ అనే యువకుడు ఇష్టారాజ్యంగా భారీ అక్రమాలకు పాల్పడ్డాడు. నియోజకవర్గంలోని కనిగిరి, హెచ్ఎంపాడు, పీసీపల్లి తదితర మండలాలకు చెందిన సుమారు 12 మందికి దొంగ ఇళ్ల పట్టాలు, అసైన్డ్ భూముల డీకే పట్టాలు, పాస్ పుస్తకాలు తయారు చేసి ఇచ్చి సుమారు రూ.అర కోటి పైగా స్వాహా చేసినట్లు తెలుస్తోంది. ఇందులో మరో ఇద్దరు కూడా ఉన్నట్లు తెలుస్తుండగా, కొందరూ రెవెన్యూ అధికారుల పాత్రకూడా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.

వెలుగు చూసింది ఇలా..



కొండారెడ్డి

లింగసముద్రం మండలానికి చెందిన జగన్నాథం సురేష్ కొంత కాలంగా కనిగిరి ప్రాంతంలో ఉంటున్నాడు. గతంలో ఉన్న తహసీల్దార్‌కు ఇతను వాహన డ్రైవర్‌గా కూడా పనిచేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇతను అక్రమాలకు పాల్పడ్డాడు. సురేష్, పాదిలికి చెందిన అతని స్నేహితుడు మర్రిబోయిన రమణయ్య కలిసి పట్టణంలోని సూరా పాపిరెడ్డి కాలనీలో తమకు పట్టాలు ఉన్నాయని పట్టణానికి చెందిన సుధాకర్‌కు చెప్పారు. అతను అతని స్నేహితుడైన బాషాకు చెప్పాడు. వీరిద్దరూ కలిసి పట్టణంలోని చింతపాలేనికి చెందిన కొండారెడ్డికి రూ.1.50 లక్షలకు అమ్మించారు. రమణయ్య అమ్మిన పట్టాను కొనుగోలుదారుడు ఆన్‌లైన్ చేసేందుకు తహసీల్దార్ కార్యాలయంలో చూపించుకున్నాడు. ప్రభుత్వ ఆన్‌లైన్, లిఖిత పూర్వక రికార్డుల్లో రమణయ్య పేరు లేదు. దీంతో బాధితుడు కొండారెడ్డి తనకు ఆ ఇంటి స్థలం వద్దని, అది దొంగపట్టా అని చెబుతూ తన డబ్బులు తిరిగి ఇవ్వాలని దాన్ని అమ్మించిన బాషా, సుధాకర్‌లను కోరాడు. దీంతో వీరిద్దరు సురేష్, రమణయ్యలకు చెప్పారు. వారు డబ్బులు తిరిగి ఇవ్వకుండా, సమాధానం చెప్పకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. సుమారు 6 నెలల నుంచి కనిపించకుండా తిరుగుతున్నారు. ఈక్రమంలో మంగళవారం అర్బన్ కాలనీలో మరొకరి దొంగపట్టాలు అమ్మేందుకు సురేష్, రమణయ్యలు వచ్చినట్లు బాధితులు తెలుసుకున్నారు. సుధాకర్, బాషా మరికొందరు వెళ్లి సురేష్, రమణయ్యలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

ఎస్పీకి ఫిర్యాదు:


అయితే అప్పటికే కనిగిరి మండలం చల్లగిరిగిలకు చెందిన వంగేపురం కోటమ్మ.. తనకు అసైన్డ్ భూమి 3 ఎకరాలు ఇప్పిస్తానని చెప్పి రూ.1.50 లక్షల డబ్బులు సురేష్ అనే అతను తీసుకుని మోసం చేశాడని, ఏడాది నుంచి నగదు ఇవ్వకుండా కనిపించడం లేదని ఎస్పీ మలికా గర్గ్‌కు స్పందనలో ఫిర్యాదు చేసింది. దీంతో స్థానిక పోలీసులకు ఎస్పీ ఆఫీసు నుంచి రిఫర్ చేశారు. ఈమేరకు కనిగిరి పోలీసులు సురేష్ కోసం గాలిస్తున్నారు. ఇంతలో సురేష్ దొరకడంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసున్నారు.

పట్టాలపై సంతకాలన్నీ గత తహసీల్దార్, ప్రస్తుత ఆర్డీఓ పేరుతోనే..

అయితే ఈ దొంగపట్టాలన్నీ గతంలో కనిగిరిలో పని చేసిన తహసీల్దార్, ప్రస్తుత కనిగిరి ఆర్డీఓ అజయ్‌కుమార్ పేరుతో ఉన్నాయి. దీంతో నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. సురేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలియడంలో బాధితులు ఒక్కొక్కరుగా పోలీస్ స్టేషన్‌కు చేరుతున్నారు.


అసైన్డ్ భూములు ఇప్పిస్తానని రూ.3 లక్షలు స్వాహా...

వాగుపల్లి గ్రామ సమీపంలో ప్రభుత్వ అసైన్డ్ భూములు పెట్టిస్తానని చెప్పి ఐదుగురి దగ్గర సురేష్ రెండు దఫాలుగా రూ.3 లక్షలు తీసుకున్నాడు. మొదట రూ.1.50 లక్షలు తీసుకుని భూమి డీకే పట్టాలు ఇచ్చాడు. ఆ తర్వాత రూ.1.50 లక్షలు తీసుకుని పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చాడు. ఆ తర్వాత ఆన్‌లైన్ పూర్తయ్యాక మరో రూ.3 లక్షలు ఇవ్వాలని తెలిపాడు. కానీ ఏడాది నుంచి కనిపించడం లేదు. ఫోన్ కూడా ఎత్తడం లేదు. దీంతో ఆ పట్టాలను, పాస్ పుస్తకాలను తహసీల్దార్ కార్యాలయంలో తీసుకెళ్లి చూపించగా, అవి దొంగవిగా చెప్పారు. కనీసం మ్యాన్యువల్ బుక్‌లో కూడా లేవని తేల్చారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు వాగుపల్లికి చెందిన బాధితుడు వెంకటరెడ్డి తెలిపాడు.



పట్టణంలో అమ్మిన దొంగ ఇంటి పట్టాలు ఇవే

చిన ఇర్లపాడులో..



వెంకటరెడ్డి

అలాగే చిన ఇర్లపాడులో డీకే పట్టాలు పెడతామని చెప్పి ఆంథోని, రూత్, బ్రహ్మారెడ్డి, జయపాల్‌తో పాటు తన దగ్గర రూ.3 లక్షలు డబ్బులు తీసుకుని దొంగపట్టాలు ఇచ్చాడని ముద్దా బాబు అనే వ్యక్తి తెలిపాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే నెల్లూరు జిల్లాకు చెందిన మరొకరి దగ్గర రూ.5 లక్షల డబ్బులు తీసుకుని దొంగ ఇంటి పట్టాలు ఇచ్చి మోసం చేసినట్లు బాధితులు తెలిపారు. ఇలా అనేక మంది బాధితులు ఉన్నట్లు సమాచారం. బాధితుడు వాగుపల్లికి చెందిన మూలే వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు ఫోర్జరీ సంతకాలతో దొంగపట్టాలు, పాస్ పుస్తకాలు ఇచ్చిన నెల్లూరు జిల్లా లింగసముద్రంకు చెందిన సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి ప్రసాద్ తెలిపారు.

విచారణకు ఆదేశించా..

నా పేరుతో సంతకం పెట్టి కొందరు దొంగ పట్టాలు, పాస్ పుస్తకాలు తయారు చేసినట్లు నా దృష్టికి వచ్చింది. దీనిపై తక్షణ విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించాను. అలాగే ఫోర్జరీ సంతకాలు, దొంగ స్టాంప్‌లతో పట్టాలు తయారు చేసిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేస్తాను.

– టీ అజయ్‌కుమార్, కనిగిరి ఆర్డీవో



గిరిజన మహిళలతో కలెక్టర్ దినేష్‌కుమార్, గిరిజన శాఖ అధికారులు

అల్లూరి జీవితం స్ఫూర్తిదాయకం

- హక్కుల కోసం బ్రిటీషర్‌లతో పోరాడిన ధీరుడు
- 126వ జయంతి వేడుకల్లో కలెక్టర్ దినేష్‌కుమార్



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: అల్లూరి సీతారామరాజు జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. మంగళవారం గిరిజన భవనంలో అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై అల్లూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ గొప్ప వ్యక్తులను స్మరించుకోవడం వలన చరిత్రకు ఒక గుర్తింపు వస్తుందన్నారు. బ్రిటీష్‌వాళ్లు తీసుకువచ్చిన చట్టాలు, పోడు భూముల్లో వ్యవసాయం చేసేందుకు వీలు లేని చట్టాలకు వ్యతిరేకంగా గిరిజనుల తరపున ఎన్నో పోరాటాలు చేసిన యోధుడు అల్లూరి అని కీర్తించారు. గిరిజనులు, ఆదివాసుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన మహనీయుడని కొనియాడారు. బ్రిటీష్ పాలకుల అకృత్య పాలనపై ఉక్కుపాదం మోపిన పోరాట పటిమ ఆయన సొంతమన్నారు. అల్లూరి చరిత్రను తల్లిదండ్రులు వారి పిల్లలకు తెలియజేయాలన్నారు. భారతజాతికి చేసిన సేవలకు గుర్తింపుగా ఒక జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరు పెట్టడం మంచి పరిణామమన్నారు. అల్లూరి పుట్టి పెరిగిన ప్రదేశంలో విగ్రహం ఏర్పాటు చేసి మాజీ రాష్ట్రపతి కోవింద్ చేతుల మీదుగా ప్రారంభించారని గుర్తు చేశారు. దీనివలన ఆయన గొప్పతనం మన రాష్ట్రంలోనే కాకుండా యావత్ దేశం, ప్రపంచ స్థాయిలో నిలబడిందన్నారు. ఆయన స్ఫూర్తితో గిరిజనులకు సేవలందిస్తామన్నారు. యర్రగొండపాలెం, దోర్నాల, అర్ధవీడు తాండాల్లో వైద్య సదుపాయాల కోసం పాలుట్లలో ప్రత్యేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాలుట్లకు వెళ్లేందుకు అవసరమైన తారు రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో అత్యవసర వైద్య సదుపాయాలు, అధికారులు ఆ ప్రాంతాలకు వెళ్లి అభివృద్ధి పనులు చేసేందుకు సులభతరమవుతుందన్నారు. గిరిజన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు సంక్షేమ పాఠశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయా ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరగకుండా పూర్తి చర్యలు తీసుకున్నామన్నారు. గడిచిన ఏడాది కాలంలో 130 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, ఎస్టీ, ఎస్సీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు లక్ష్మయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జ్ఞాపకశక్తికి సూర్య యజ్ఞం ఉపకరిస్తుంది

- బ్రోచర్ ఆవిష్కరించిన కలెక్టర్ దినేష్‌కుమార్



సూర్యయజ్ఞ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: విద్యార్థుల్లో జ్ఞాపక శక్తి పెరిగేందుకు సూర్య యజ్ఞం ఉపకరిస్తుందని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. మంగళవారం ప్రకాశం భవనంలో సూర్య యజ్ఞం కార్యక్రమానికి సంబంధించి బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సూర్య యజ్ఞ కార్యక్రమం ప్రారంభమైందన్నారు. ప్రణవ సంకల్పయోగ సమితి వ్యవస్థాపకులు, ఇండియన్ యోగ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పతంజలి శ్రీనివాస్ ఆయన సిబ్బందితో కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా సూర్య నమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయామం చేయించడం వలన పిల్లల్లో జ్ఞాపకశక్తి పెరగడంతో పాటు శారీరక, మానసిక దృఢత్వం కూడా వస్తుందన్నారు. మొదటిగా ప్రాథమికంగా కార్యక్రమం నిర్వహించి అనంతరం అడ్వాన్స్ యోగలో శిక్షణ ఇస్తారన్నారు. దీనిలో డీఈఓ రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ ఆస్ట్రేలియా కన్వీనర్‌గా సూర్యనారాయణరెడ్డి


చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి

హనుమంతునిపాడు: వైఎస్సార్ సీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగ ఆస్ట్రేలియా కన్వీనర్‌గా మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన చింతలచెరువు సూర్యనారాయణరెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్ట్రేలియాలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తన మీద నమ్మకం ఉంచి పదవికి ఎంపిక చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి


ఘటనా స్థలంలో వెంకటేశ్వరవర్మ మృతదేహం

నాగులుప్పలపాడు: అతి వేగం నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. వై జంక్షన్ లోకి వేగంగా మోటారు సైకిల్‌పై వచ్చి ఎదురుగా వచ్చిన లారీని ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం సాయంత్రం నాగులుప్పలపాడు- ఇంకొల్లు కూడలి వద్ద జరిగింది. నాగులుప్పలపాడు ఎస్సై హరిబాబు సమాచారం మేరకు ఒంగోలు గోపాలనగర్‌కు చెందిన కలం వెంకటేశ్వర వర్మ (46) ఇంకొల్లు నుంచి ఒంగోలు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నాగులుప్పలపాడు వద్ద ఉన్న వై జంక్షన్‌లో నుంచి 216 జాతీయ రహదారి ఎక్కుతున్న క్రమంలో ఒంగోలు నుంచి చీరాల వెళ్తున్న లారీ పక్క నుంచి వేగంగా వచ్చిన మోటారు సైకిల్‌ను బలంగా ఢీకొనడంతో వెంకటేశ్వరవర్మ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అధ్యాపకుడు మృతి

- మరో అధ్యాపకునికి స్వల్ప గాయాలు


ఘటనా స్థలంలో హరిబాబు మృతదేహం


హరిబాబు (ఫైల్)

పామూరు: రోడ్డు ప్రమాదంలో తెలుగు అధ్యాపకుడు మృతి చెందగా మరో అధ్యాపకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన మంగళవారం రాత్రి మండలంలోని దూబగుంట్ల నుంచి బుక్కాపురం గ్రామాల మధ్య 167బీ జాతీయ రహదారిపై జామాయిల్‌తోట సమీపంలో జరిగింది. పోలీసులు, క్షతగాత్రుడు వెంకటేశ్వర్లు తెలిపిన సమాచారం ప్రకారం... నెల్లూరుజిల్లా వరికుంటపాడు మండలం పామూరుపల్లె గ్రామానికి చెందిన రెడ్లదిన్నె హరిబాబు, సీఎస్‌పురం మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన మీసాల వెంకటేశ్వర్లులు పామూరులోని ఎస్వీ జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. కళాశాలలో విధులు ముగించుకుని పామూరులో సొంత పనులు చూసుకొని వారి స్వగ్రామాలకు వేర్వేరు బైక్‌లపై తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో దూబగుంట్ల, బుక్కాపురం గ్రామాల మధ్య జామాయిల్ తోట సమీపలో 167బీ జాతీయ రహదారిపై డీజిల్ అయిపోయి టిప్పర్ నిలిచిపోయి ఉండగా ఎదురుగా మరో వాహనం లైట్ల వెలుగులో టిప్పర్ వారికి కనిపించలేదు. బైక్‌పై ముందుపోతున్న తెలుగు అధ్యాపకుడు రెడ్లదిన్నె హరిబాబు(33) ఆగి ఉన్న టిప్పర్‌ను బలంగా ఢీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక వస్తున్న మీసాల వెంకటేశ్వర్లు ఘటనను చూసి బైక్‌ను అదుపు చేసే క్రమంలో కిందపడటంతో ఛాతి, భుజాలకు గాయాలయ్యాయి. క్షతగ్రాతుని పామూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సీఐ కాటూరి శ్రీనివాసరావు, ఎస్సై కె.సురేష్ యాదవ్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదఘటనపై వివరాలు సేకరిస్తున్నారు. 108 వాహనంలో క్షతగాత్రుని పామూరుకు తరలించగా చికిత్సపొందుతున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మరికొద్ది సేపట్లో ఇంటికొస్తాడనుకుంటే.. మృత్యు ఒడికి

కళాశాలకు వెళ్లి మరి కొద్దిసేపట్లో ఇంటికి వస్తాడని ఎదురుచూస్తున్న హరిబాబు భార్య శ్రావణి..భర్త మృతి వార్త తెలియడంతో కన్నీరు మున్నీరుగా విలపించింది.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఒంగోలు టౌన్: వేగంగా వెళుతున్న బైకు అదుపు తప్పి పడిపోడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నగరంలోని బండ్లమిట్టలో నివాసం ఉంటున్న కుంచాల సుబ్బారావు(35) మున్సిపాలిటీలో గ్యాంగ్ కూలిగా పనిచేస్తుంటారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సోమవారం ఎప్పటిలాగే డ్యూటీకి వెళ్లిన సుబ్బారావు మధ్యాహ్నం భోజనం చేసేందుకు ఇంటికి వచ్చాడు. తిరిగి విధులకు హాజరయ్యేందుకు బైకు మీద బయలుదేరగా..కొత్త కూరగాయల మార్కెట్ వద్ద బైకు అదుపుతప్పి పడిపోయాడు. కానరాని చోట దెబ్బ తగలడంతో స్పృహ కోల్పోయాడు. సమాచారం అందుకున్న ఆయన భార్య లత బంధువుల సహకారంతో అక్కడికి చేరుకొని అతడిని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


వై.పాలెంలో సీఎస్ గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి


వైపాలెం కేజీబీవీలో మెనూను పరిశీలిస్తూ..

మెనూ అమలులో కక్కుర్తి వద్దు

- సంక్షేమ హాస్టళ్లను అధికారులు తనిఖీ చేయాలి
- ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి

యర్రగొండపాలెం: చిన్నారుల భవిష్యత్తు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధతో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ సక్రమంగా అమలయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్ రెడ్డి ఆదేశించారు. విద్యార్థులకు అందించే భోజనాల వద్ద కక్కుర్తి పడకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అధికారులను ఉద్దేశించి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు తీరును అధికారులు తనిఖీ చేయాలని సూచించారు. ఆహార పదార్థాల నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని చెప్పారు. అనంతరం మండల రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కంది పప్పు, పంచదార అధిక ధరలకు అమ్మి ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దన్నారు. పేదలకు రేషన్ సరుకులు సక్రమంగా సరఫరా చేయాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. రేషన్ గోడౌన్‌ను పరిశీలించి తూకంతో తేడా లేకుండా బియ్యం సరఫరా చేయాలని అధికారులకు సూచించారు.


మార్కాపురం : చిన్నారితో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్

గిరిజన పాఠశాల వార్డెన్‌పై ఆగ్రహం

వైపాలెం గిరిజన గురుకుల పాఠశాలలో మెనూ అమలు చేయకపోవడంతో వార్డెన్ లక్ష్మయ్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తరగతి గదులను విద్యార్థులతో శుభ్రం చేయించడం సరైన పద్ధతి కాదన్నారు. ముందుగా కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు.

అంగన్‌వాడీ సిబ్బందికి అభినందన

గురిజేపల్లి, బోయలపల్లి, స్థానిక బీసీ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై ఫుడ్ కమిషన్ చైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారు. బోయలపల్లిలో అంగన్‌వాడీ సిబ్బంది ఎం.ప్రభావతి, పి.వెంకటశివకు శాలువా కప్పి సన్మానించారు. బీసీ కాలనీలో అంగన్‌వాడీ కార్యకర్త కోటేశ్వరిని సన్మానించడంతోపాటు రూ.వెయ్యి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. చిన్నారులపై మరింత శ్రద్ధ వహించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని వారికి సూచించారు.

మెరుగైన బోధన.. అత్యుత్తమ మార్కులు

వైపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఫోర్టిఫైడ్ బియ్యంలో పోషకాలపై అవగాహన కల్పించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి చేస్తున్న కృషితో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంచి మార్కులు సాధిస్తున్నారని, గతంలో ఇలాంటి పరిస్థితి తాను చూడలేదన్నారు. త్రిపురాంతకం మండలం గణపవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థి 594 మార్కులతో సత్తా చాటిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులతోపాటు పాఠశాలకు, విద్యను ప్రోత్సహిస్తున్న జగన్ మామయ్యకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట డీఎస్‌ఓ ఉదయ్, డీడీ పి.సురేష్, ఐసీడీఎస్ పీడీ కె.మాధురి, ఫుడ్ సేఫ్టీ అధికారి నరసింహులు, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, ఎంపీడీఓ వైవీ నాగేశ్వర ప్రసాద్, సీడీపీఓ పద్మ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ

మార్కాపురం: పట్టణంలోని పట్టణంలోని దసరా మండపం, ఆర్టీసీ బస్టాండు, పూలసుబ్బయ్య కాలనీ, రాయవరం జనరల్ అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ సీహెచ్ విజయప్రతాప్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు అందజేస్తున్న ఆహారం, రికార్డులను పరిశీలించారు. చిన్నారుల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సబ్ కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న బీసీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. ఆయన వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణతోపాటు గోడౌన్ డీటీ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

లోప రహితంగా ఓటరు జాబితా

- అధికారులు ఆ దిశగా శ్రద్ధ వహించాలి
- నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు
- డోర్ నంబర్ లేని ఇళ్ల గుర్తింపునకు ప్రత్యేక డ్రైవ్
- జిల్లా అధికారులతో సమీక్షలో కలెక్టర్ దినేష్‌కుమార్


ఓటర్ల జాబితా తయారీపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితాలను లోప రహితంగా రూపొందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రకాశం భవనంలో ఓటర్ల జాబితా తయారీపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. డోర్ నంబర్లు లేని ఇళ్లను వారంలోగా గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. ఆ దిశగా స్థానిక సంస్థలకు సర్క్యులర్ జారీ చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బీఎల్‌ఓలు నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటున్నారా లేదా అనే అంశాన్ని పర్యవేక్షించాలని చెప్పారు. సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి నోట్ ఫైల్ రూపొందిస్తే సీఈఓను కలిసి వివరిస్తానని తెలిపారు. ఇంటింటి సర్వే నిర్వహించేందుకు ముందుగానే మండల, డివిజన్ స్థాయిలో బీఎల్‌ఓలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితా పరిశీలనా ప్రక్రియలో వలంటీర్లను ఎట్టి పరిస్థితుల్లో భాగస్వాములుగా చేయవద్దని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా చేర్పులు, తొలగింపుల డేటాను ప్రతి వారం విశ్లేషించాలన్నారు. గుర్తింపు ఉన్న అన్ని రాజకీయ పార్టీలతో ఈ వారంలోనే సమావేశం నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు కార్డుకు ఆధార్ నంబర్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేథు మాధవన్, డీఆర్‌ఓ శ్రీలత, ఒంగోలు, కనిగిరి ఆర్డీఓలు విశ్వేశ్వరరావు, అజయ్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర జిల్లా అధికారులు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంను విమర్శించే స్థాయి ఉగ్రకు లేదు

- నీకు రాజకీయ బిక్ష పెట్టింది వైఎస్సార్ కుటుంబమే గుర్తు పెట్టుకో..
- రాజకీయ లబ్ధి కోసమే దుష్ప్రచారాలు, అసత్య ఆరోపణలు
- టీడీపీ పాలనలోనే అవినీతి, అక్రమాలు, హత్యా రాజకీయాలు
- వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం


మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ ప్రకాశం, ఇతర నేతలు

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకుడు ఉగ్ర నరసింహారెడ్డికి లేదని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ సాల్మన్ రాజులు ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు మాట్లాడుతూ నీకు రాజకీయ భిక్ష పెట్టింది.. వైఎస్సార్ కుటుంబమేనని, అది మరిచి వైఎస్ కుటుంబంపై విమర్శలు చేస్తున్న నీకు ప్రజలు మరోసారి తగిన గుణపాఠం చెబుతారన్నారు. 2014, 2019 ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు నిన్ను ఛీదరించుకున్న ఇంకా మార్పు రాలేదని ఘాటుగా విమర్శించారు. ఉగ్ర హయాంలో జరిగిన దుర్మార్గాలు, దౌర్జన్యాలకు నేటికి నియోజకవర్గ ప్రజలు భయపడుతున్నారని గుర్తు చేశారు. హత్య రాజకీయాలు, దుర్మార్గపు రాజకీయాలు చేసింది, జరిగింది టీడీపీ పాలనలోనే అని తీవ్రంగా దుయ్యబట్టారు. చంద్రబాబు పాలనలో జరిగిన హత్యలు, వెన్నుపోటు రాజకీయాలు రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. పిల్లనిచ్చిన సొంత మామనే వెన్నుపోటు పొడిచిన దుర్మార్గుడు చంద్రబాబు అన్ని తీవ్రంగా దుయ్యబట్టారు.

వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 99 శాతం సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయన్నారు. నియోజకవర్గంలో కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కనిగిరి మున్సిపాలిటీలో సుమారు రూ.8 కోట్లతో రోడ్లు, డ్రైన్లు వేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ సమస్య పరిష్కారానికి పట్టణానికి రెండు సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత టీడీపీ పాలనలో మున్సిపాలిటీ అవినీతి రాజ్యమేలిందని ఘాటుగా విమర్శిచారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ పట్టణ కార్యదర్శి సీహెచ్ కిషోర్, కౌన్సిలర్లు దేవరాజ్, శ్రీరాం సతీష్, సేవాదళ్ అధ్యక్షుడు శ్రీహరిరెడ్డి, రాష్ట్ర నాయకులు పిల్లి లక్ష్మీ నారాయణరెడ్డి, బొర్రాజు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చరిత్రలో చిరస్థాయిగా అల్లూరి సాయుధ పోరు


అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులు

- ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: బ్రిటీష్ పాలకుల ధమనకాండకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు సాగించిన సాయుధ పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని ఎస్పీ మలికా గర్గ్ కొనియాడారు. అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అల్లూరి చేసిన పోరాటం బ్రిటీష్ పాలకుల దురాగతాలు, ధమనకాండకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేపట్టేందుకు అనేక మంది ప్రజలను ప్రేరేపించిందన్నారు. భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో అల్లూరి ఒక మహోజ్వల శక్తి అని, తెల్లవారి గుండెల్లో సింహస్వప్నంగా నిలిచారన్నారు. తెలుగువారి తెగువ, పౌరుషానికి అల్లూరి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తారన్నారు. ఆయన పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఒంగోలు రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, హరిబాబు పాల్గొన్నారు.


రాజకీయాల్లో మకుటంలేని మహారాజు రోశయ్య


మాజీ ముఖ్యమంత్రి రోశయ్య విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి, వెంకటేష్

- చీరాలలో ఎంజీసీ క్లాత్ మార్కెట్ ఎదుట రోశయ్య కాంస్య విగ్రహం ఆవిష్కరణ
- విగ్రహావిష్కరణ సభలో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

చీరాల రూరల్: రాజకీయాల్లో మకుటంలేని మహారాజుగా వెలుగొందారని, ఎంతో మంది ముఖ్యమంత్రుల వద్ద మంత్రిగా పనిచేసి ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా సేవలందించిన ఘన చరిత్ర కొణిజేటి రోశయ్యదని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి అన్నారు. బాపట్ల జిల్లా చీరాల ఎంజీసీ క్లాత్ మార్కెట్ వద్ద రోశయ్య కాంస్య విగ్రహాన్ని మంగళవారం కరణం బలరామ కృష్ణమూర్తి, ఆయన తనయుడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్, రోశయ్య తనయులు శివ, శ్రీమన్నారాయణ మూర్తిల చేతులు మీదుగా ఆవిష్కరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కొణిజేటి రోశయ్య చేసే రాజకీయాల ముందు ఎంతటివారైనా దిగదుడుపేనన్నారు. ఆయన ఛలోక్తులతో అసెంబ్లీని కూడా ఎంతో మంచి వాతావరణంలో నడిపించేవారని గుర్తు చేశారు. వయస్సులో ఆయనకంటే తాను చిన్నవాడినైనప్పటికీ మంచి సలహాలు ఇస్తుంటారని చెప్పారు. దేశంలోనే అత్యధికంగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత ఆయనదేనన్నారు. రోశయ్య కుటుంబంతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉండేదన్నారు. ఆయన స్నేహానికి ప్రాణమిస్తారని చెప్పారు. ముఖ్యంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి అంటే రోశయ్యకు ఎనలేని ప్రేమని, ఆయన చెప్పిన మాట జవదాటేవారు కాదని గుర్తు చేశారు. వైఎస్ మరణానంతరం జరిగిన పరిణామాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా సేవలందించారని చెప్పారు. ఆయన అనేక హోదాల్లో సేవలందించినప్పటికీ ఎంతో నిరాడంబరంగా, అతి సామాన్యంగా ఉండేవారని చెప్పారు. ఆయన చేసిన సేవలు ప్రజల గుండెల్లో నిలిచిపోతాయన్నారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ మాట్లాడుతూ రోశయ్య పేరు కూడా తాను ఉచ్చరించేందుకు అర్హులం కాదని.. పెద్దాయన అని మాత్రమే పిలుస్తామని చెప్పారు. పెద్దాయన చీరాల ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి పథంలో పయనింపచేశారని, ఆయన అడుగు జాడల్లో ఆయన స్ఫూర్తితో అందరం ముందుకు నడుస్తామని చెప్పారు. ఆయన తనయులు శివ, శ్రీమన్నారాయణ మూర్తిలు మాట్లాడుతూ చీరాల ప్రజలు తన తండ్రిపై ఇంతగా ప్రేమాభిమానాలు చూపించడం చూపిస్తుంటే గర్వంగా ఉందన్నారు. తమ కుటుంబం సభ్యులకంటే చీరాల ప్రజలపైనే తనతండ్రికి ఎనలేని ప్రేమని వారు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, రామసుబ్బులు, కౌన్సిలర్లు మామిడాల రాములు, పాత్తూరి సుబ్బయ్య, చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు ప్రభాకరరావు, మల్లెల లలితా రాజశేఖర్, స్వాతి, ఆర్యవైశ్య ప్రముఖులు తేలప్రోలు వెంకటేశ్వరరావు, తులాబందుల వెంకట సురేష్, చిన్ని లీలాధరరావు, ఎస్.వేణుగోపాల్, ఎస్.రాఘవయ్య, చేబ్రోలు బాలాజి, వలివేటి మురళీ కృష్ణ, అచ్యుత శ్రీనివాసరావు, పెనుగొండ కిషోర్‌బాబు, గుర్రం రాఘవరావు, ఊటుకూరి ఏకాంబరేశ్వరరావు, చారుగుళ్ల ప్రసాద్, పాతపాటి అంజిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పోయిన ఫోన్ రికవరీ


ఫోన్‌ను అందిస్తున్న ఏఎస్సై వెంకట్రావు

చీమకుర్తి: శిక్షణ కార్యక్రమం కోసం కనిగిరికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మనోహర్ ఇటీవల సంతనూతలపాడు మండలం మైనంపాడు డైట్ కాలేజీకి వచ్చాడు. కాగా అక్కడ పోగొట్టుకున్న ఫోన్‌ను సంతనూతలపాడు ఎస్సై వి.అంజనేయుల సహకారంతో ఏఎస్సై జి.వెంకట్రావు కనుగొని మంగళవారం మనోహర్‌కు సంతనూతలపాడు పోలీస్ స్టేషన్‌లో అందించారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిష్టర్ పోర్టల్ విధానం ద్వారా పోయిన ఫోన్‌కు సంబంధించిన ఐఎంఈఐ నంబర్ ద్వారా గుర్తించి ఫోన్‌ను జిల్లా పోలీస్ యంత్రాంగం ద్వారా తీసుకురాగలిగారు. ఫోన్ దొరకటంతో మనోహర్ హర్షం వ్యక్తం చేస్తూ సంతనూతలపాడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సింహాద్రి జ్యోతిర్మయికి కళామందిర్ పురస్కారం

ఒంగోలు టౌన్: చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలుకు చెందిన ప్రముఖ కవయిత్రి సింహాద్రి జ్యోతిర్మయిని కళా మందిర్ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం అధ్యక్షురాలు తేళ్ల అరుణ తెలిపారు. ఈ మేరకు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకుడు పైనేని తులసినాయుడు సమాచారం పంపారని పేర్కొన్నారు. ప్రస్తుతం జ్యోతిర్మయి నవ్యాంధ్ర రచయిత్రుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. పురస్కారానికి ఎంపికైన జ్యోతిర్మయికి నగరానికి చెందిన సాహిత్యవేత్తలు తెలుగు లోగిలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమరావు, నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లికార్జునరావు తదితరులు అభినందనలు తెలిపారు.

4.258 కేజీల గంజాయి సీజ్

పొదిలి రూరల్: పొదిలి మండలం ఉప్పలపాడు పంచాయతీలోని గోగినేనివారిపాలెం వద్ద అక్రమంగా గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై మల్లికార్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు-కర్నూలు రోడ్డులోని గోగినేనివారిపాలెం బస్ షెల్టర్ వద్ద ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులో నిందితులైన గురునాథం శివకృష్ణ, గురునాథం శ్రావణిని పొదిలి సీఐ కేవీ రాఘవేంద్రరావు తనిఖీ చేయగా 4.258 కేజీల గంజాయి లభ్యమైందని పేర్కొన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్

- స్కాన్ సెంటర్ల నిర్వాహకులకు కలెక్టర్ హెచ్చరిక

ఒంగోలు అర్బన్: జిల్లాలోని స్కానింగ్ సెంటర్లలో నింబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సీజ్ చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్ల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రకాశం భవనంలో పీసీపీఎన్‌డీటీ చట్టంపై వైద్యారోగ్య శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. నూతనంగా స్కానింగ్ సెంటర్ల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులతోపాటు రెన్యువల్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఐఈసీ బోర్డులు, డాక్టర్ వివరాలు ప్రజలకు కనిపించేలా స్కాన్ సెంటర్లలో అతికించాలని స్పష్టం చేశారు. రోజూ నిర్వహించే స్కానింగ్ పరీక్షల వివరాలు వెబ్‌పోర్టల్‌లోని ఫామ్-ఎఫ్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ సురేష్‌కుమార్, ఉప వైద్యారోగ్యశాఖాధికారి మాధవీలత, డాక్టర్ పద్మజ, విక్రమ శ్రీనివాసరావు, గౌతమి, అంకయ్య, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.